క్లుప్తంగా

కాల్వలో పూడికతీత



ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా డీ 6 కాల్వలో పూడికతీత పనులను చేపడుతున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండలంలోని కత్తెపల్లిలో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో జూరాల ప్రధాన ఎడుమ కాల్వకు అనుసంధానమైన డీ 6 కాల్వలో పూడికతీత, పిచ్చి మొక్కలు తొలగింపు చేపట్టినట్లు తెలిపారు. ఉపాధి పనులను వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు మేలు చేకూరుతుందని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్, రైతులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఆర్‌ఎంపీ మృతి

పాన్‌గల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆర్‌ఎంపీ డాక్టర్ మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కేతేపల్లికి చెందిన ఆర్‌ఎంపీ భాస్కర్‌రెడ్డి (58) మే 29న కేతేపల్లి నుంచి వనపర్తి వెళ్తుండగా.. అంజనగిరి సమీపంలో బ్రిడ్జి మలుపు వద్ద కారు అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడటంతో వెంటనే హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, భార్య హరిణి ఉన్నారు.

వైద్య సేవలపై అవగాహన



వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో లభిస్తున్న వైద్య వసతులపై ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి కుటుంబ వివరాలను నమోదు చేయడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలను జాగ్రత్త పరచాలని కోరారు.

పరామర్శ



అడ్డాకుల: జానంపేటకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త దాసు తల్లి ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని బుధవారం సాయంత్రం డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. మృతురాలి కుమారుడు దాసును ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండా జగదీశ్వర్, మాజీ ఎంపీటీసీ బోయ కృష్ణయ్య, వెంకటేష్, రాజు తదితరులు ఉన్నారు.

మత్స్యకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

కొల్లాపూర్ రూరల్: మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సంఘం ఎన్నికలు నిర్వహించాలని మత్స్యకార సమీకృత సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సింగోటంలో లక్ష్మీదేవమ్మ గుట్టపై ఉమ్మడి జిల్లా మత్స్యకారుల సమీకృత సంఘాల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పది జిల్లాలు ఉన్నప్పుడు సంఘాల ఎన్నికలు నిర్వహించారని, ఇప్పటి వరకు అప్పటి అధ్యక్షులే కొనసాగుతున్నారన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కోడేరు: మండలంలోని బాడిగదిన్నెలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పంచాయతీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను కార్యకర్తలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, జగన్మోహన్ రెడ్డి రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా..

- దశాబ్ది ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం



కొన్నూరు రైతువేదికను పరిశీలించిన జిల్లా వైద్యాధికారి రవిశంకర్

అమరచింత: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు కార్యాచరణ రూపొందించాలని మండల స్పెషల్ అధికారి, డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లి, నాగల్‌కడ్మూర్, నందిమళ్ల గ్రామాల్లో గల రైతువేదికలను మండల అధికారులతో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. రైతువేదికలలో సౌకర్యాలను కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి,ఏఓ. వినయ్, ఎఈఓలు రాజేష్,మల్లేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మదనాపురం: దశాబ్ది ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడేలా ఉండాలని, 21 రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిశంకర్, జెడ్పీ సీఈఓ శ్రావణ్‌కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. జూన్ 3న రైతు వేదికలు కేంద్రంగా సమావేశాలు ఏర్పాటు చేసి రైతు సంక్షేమంపై ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాన్ని వివరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణయ్య, రైతుబంధు మండల అధ్యక్షుడు హనుమాన్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌నారాయణ, సర్పంచ్‌లు జగన్ రాంనారాయణ, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీఓ నాగేంద్రం, ఏఈఓ స్పందన, పంచాయతీ కార్యదర్శి రాజకుమారి, మనోహర్‌రెడ్డి, ఏఎన్‌ఎం లక్ష్మమ్మ పాల్గొన్నారు.

రైతు వేదికలను అలంకరించాలి

పాన్‌గల్: ఈనెల 3న నిర్వహించే రైతు దినోత్సవం సందర్భంగా మండలంలోని ఐదు రైతువేదికలను మామిడి తోరణాలు, పువ్వులు, విద్యుత్ బల్బులతో అలంకరించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణి, ఏఓ సాజిద్ రహమాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఏఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు, ఏఈఓ లింగస్వామి పాల్గొన్నారు.

వీపనగండ్ల: దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలను జాగృతం పరిచి తెలంగాణ ప్రగతిని చాటాలని ఎంపీపీ కమలేశ్వర్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పాండునాయక్, ఎంపీడీఓ కతలప్ప, సింగిల్ విండో చైర్మన్ రామన్‌గౌడ్, తూంకుంట రైతువేదిక ఇన్‌చార్జ్ సుజిత, ఎస్ఐ రామన్‌గౌడ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రేవల్లి ఎంపీపీ సేనాపతి, జెడ్పీటీసీ భీమయ్య అన్నారు. బుధవారం రేవల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.



వీపనగండ్లలో..



మదనాపురంలో..



పాంరెడ్డిపల్లిలో..

మండలం చేసే వరకు ఉద్యమం ఆగదు



మాట్లాడుతున్న కాశీనాథ్

నారాయణపేట రూరల్: కోటకొండను మండలంగా ప్రకటించే వరకు ఉద్యమం ఆగదని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు కాశీనాథ్ స్పష్టం చేశారు. మండలంలోని కోటకొండలో నిర్వహిస్తున్న రిలేదీక్షలు 22వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బుధవారం దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వెనకబడిన ప్రాంతంగా మిగిలిపోయిన కోటకొండను మండలంగా మార్చి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. విద్య, వైద్యం తదితర విషయాల్లో హైస్కూల్, పీహెచ్‌సీలకు భవనాలు, విద్యుత్ సబ్ స్టేషన్ అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు తాత్కాలికంగా భవనాలు ఉన్నాయని, కొత్త భవన నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలం ఉందని అన్నారు. వెంటనే ఎమ్మెల్యే చొరువ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కోటకొండను మండలంగా ప్రకటించేలా ఒత్తిడి తీసుకుని రావాలన్నారు. లేకుంటే భవిష్యత్‌లో ఉద్యమానికి సిద్ధమన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, యాదగిరి, వెంకట్రాములు, చెన్నప్పయాదవ్, హాజి, దస్తప్ప, నర్సింహులు, బాలకృష్ణ, తిర్మలాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ యుగంధర్

కొత్తకోట రూరల్: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దమందడి మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ జయశంకర్ అధ్యక్షతన ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కోఆర్డినేటర్ యుగంధర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజ భాగస్వామ్య మద్దతుతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, బడి ఈడు పిల్లలను గుర్తించడంతో పాటు సమీప పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచి గుణాత్మక విద్యను అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల వయస్సు దాటిన చిన్నారులను సమీపంలో గల ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని, బడి బయట పిల్లలను గుర్తించి వారి వయస్సుకు తగిన తరగతిలో చేర్పించాలన్నారు. బాలికల విద్య యొక్క ప్రాముఖ్యతను గ్రామాల్లో వివరించి బాలికలందరిని పాఠశాలలో నమోదు చేయించాలని కోరారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా ఇంగ్లిష్ మీడియంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రజల పక్షాన పోరాడేందుకు సిద్ధం

వనపర్తి: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఒంటెద్దు పోకడలను ప్రశ్నించే గొంతుకనవుతానని వైఎస్సార్ టీపీ వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ బూజాల వెంకటేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నియోజకవర్గం పార్టీ కార్యాలయాన్ని ఆయన కార్యకర్తలతో కలసి శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కొన్ని దశాబ్దాల పాటు వనపర్తి నియోజకవర్గంలో అధికారం అనుభవించిన నేతలు సైతం బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న అన్యాయాలను నోరు విప్పకపోవటం శోచనీయమని, వనపర్తిలో చోటు చేసుకున్న అక్రమాలపై దుబ్బాక ఎమ్మెల్యే ప్రశ్నించే వరకు స్థానిక ప్రతిపక్ష నాయకులు నిద్ర పోతున్నారా అని ప్రశ్నించారు. ఇకపై ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ.. వైఎస్సార్ ఆశయాలను కొనసాగించేందుకు గడప గడపకు తిరుగుతూ.. ప్రజలను జాగృతం చేస్తామన్నారు. వైఎస్‌ఆర్ హయాంలో ప్రతి పేద ఇంటికి సంక్షేమ పథకాలు అందించారని ఆయన గుర్తు చేశారు. అందుకే వైఎస్‌ఆర్ ఫొటో ప్రతి పేదోడి ఇంట్లో ఉంటుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ముమ్మడి చాణక్య, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, అసెంబ్లీ ఎన్నికల ఇన్‌ఛార్జి సతీష్, నాయకులు పరమేష్, ప్రతాప్, రాము పాల్గొన్నారు.

ముదిరాజులు రాజకీయంగా ఎదగాలి



చైతన్య సభకు హాజరైన ముదిరాజ్‌లు

ఖిల్లాఘనపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో పెద్ద సంఖ్యలో ఉన్న ముదిరాజులు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యా పరంగా ఎదగాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు సాయిలు అన్నారు. బుధవారం మండలంలోని ఖిల్లాఘనపురం, ఉప్పరిపల్లి గ్రామాల్లో ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం చైతన్య సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ముదిరాజులందరిని ఏకం చేసే కార్యక్రమంలో భాగంగా ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. అదే సమయంలో మండల కేంద్రంలో ముదిరాజ్ ముద్దు బిడ్డ పండుగోళ్ల సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. సమాజంలో ముదిరాజులను కేవలం ఓట్ల కోసమే వాడుకుంటున్నారనే విషయాన్ని ముదిరాజ్ కుటుంబ సభ్యులు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, శ్రీనివాసులు, మధు, అంజనేయులు, రాంచంద్రి, గోపి, చెన్నయ్య, శేషయ్య, నర్సింహులు, శ్రీను, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వెంకటేష్‌ను సన్మానిస్తున్న జూరాల గ్రామస్తులు

ఆత్మకూర్: ప్రతి ఒక్కరూ ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని, చట్టాలు అందరికీ సమానమని సమాచార చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగేండ్ల వెంకటేష్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని జూరాల గ్రామంలో సమాచార హక్కు చట్టం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారి తనం పెంపొందించేందుకు 2005లో కేంద్రప్రభుత్వం సమాచారహక్కు చట్టాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో సమాచార చట్టానికి కమిషనర్ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కమిషనర్‌ను నియమించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల బాధ్యులు రాజు, నర్సింహులు, నిరంజన్, సాయి, నరేందర్, చెన్నప్ప, రాము, శివశంకర్, దశరథ్ తదితరులు ఉన్నారు.

పొగాకుకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న డాక్టర్ హరినాథ్‌రెడ్డి

పాన్‌గల్: పొగాకు వల్ల శరీరంలోని అన్ని అవయవాలు పాడైపోయి మరణించే అవకాశం ఉందని, వాటికి దూరంగా ఉంటూ ఆరోగ్యంగా జీవించాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయకూడదని, 18ఏళ్ల లోపు పిల్లలకు పొగాకు అమ్మడం నిషేధమన్నారు. ధూమపానం వలన క్యాన్సర్, బీపీ, ఎముకలు బలహీనంగా మారడం వంటి దుష్పరిణామాలు సంభవిస్తాయని తెలిపారు. దీంతో పొగాకు దూరంగా ఉంటూ ఆరోగ్యానికి అవసరమైన పోషకాలను తీసుకోవాలని సూచించారు. ఎమ్‌ఎల్‌హెచ్‌పీ మైథిలి, సూపర్‌వైజర్లు సుమనశ్రీ, శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములకు చెందిన ఆడెం తిరుపతమ్మ అనారోగ్యం పాలై హైదరాబాద్‌లోని పంజాగుట్టలో గల నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె కుమారుడు కురుమన్న ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా.. ఈ విషయాన్ని స్థానిక నాయకులు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. మంజూరైన రూ.2.50వేలు ఎల్‌ఓసీ కాపీని బుధవారం మంత్రి జిల్లా కేంద్రంలోని క్యాంప్ ఆఫీసులో బాధితురాలి కుమారుడు కురుమన్నకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

పెబ్బేరు: రాష్ట్రంలోని దూప దీప నైవేద్య అర్చకుల వేతనాలు పెంచడంపై కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు పీవీ లక్ష్మీకాంత ఆచార్యులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్చకుల వేతనం రూ. 6 వేల నుంచి రూ. 10 వేల వరకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు పనులు ప్రారంభం



గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం పాటిగడ్డతండా నుంచి హనుమాన్ ఆలయం వరకు మట్టిరోడ్డు నిర్మించేందుకు పనులు ప్రారంభమయ్యాయి. మట్టిరోడ్డు పనులు పూర్తయితే ప్రజల రాకపోకలకు సమస్యలు తీరుతాయని నాయకులు అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అడిగిన వెంటనే రూ.ఐదు లక్షలు మంజూరు చేయించి పనులు ప్రారంభించేందుకు కృషి చేశారని స్థానికులు తెలిపారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని చీకురుచెట్టుతండాలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాన్ని తండావాసులు బుధవారం అంగరంగ వైభవంగా జరుపుకొన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, గిడ్డంగుల సంస్థ అభివృద్ధి చైర్మన్ సాయిచంద్, ఎంపీపీ మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధాకృష్ణ, ఉప సర్పంచ్ రమేష్, వైస్‌ఎంపీపీ రఘుప్రసాద్, రమేష్‌గౌడ్, జయంతి, తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతియాదవ్, మోహన్‌నాయక్, రమేష్‌నాయక్, శ్రీను, గోవింద్, మోహన్‌బాబు తదితరులు ఉన్నారు.

ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ



పండ్లు, బ్రెడ్ అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న రోగులకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎంపీటీసీ మాజీ సభ్యుడు మహంకాళీ విష్ణు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జుబేర్‌అహ్మద్ ఆధ్వర్యంలో రోగుల పండ్లు, బ్రెడ్ అందించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదల కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి సేవా కార్యక్రమాలను మండలంలో విస్తరించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో మన్సూర్, అయ్యూబ్, బడేసాబ్, జుల్గివెంకటేష్, శ్రీధర్, పారుపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

5న కలెక్టరేట్ ఎదుట ధర్నా



మాట్లాడుతున్న నాయకులు

చిన్నంబావి: ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునేందుకు జూన్ 5న వనపర్తి కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు కూలీలు కదిలి రావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని మియాపూర్‌లో ఉపాధి పనులు జరిగే ప్రదేశాన్ని సందర్శించి కూలీల ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది నిధులను తగ్గిస్తూ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గపు చర్యలను సమష్టిగా అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, శంకర్, కూలీలు పాల్గొన్నారు.

తెల్లరాళ్లపల్లితండాలో ట్యాంకర్ల నీరే దిక్కు



ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ట్యాంకర్ల నీరే దిక్కు అయ్యిందని తండావాసులు వాపోతున్నారు. ఒక పక్క అధికారులు ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తున్నామని చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో అమలు కాక ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఇప్పటికైన వారు స్పందించి నీటి సరఫరా అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త విద్యుత్ లైన్‌కు నిధులు మంజూరు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని పాలమూరు ప్రాజెక్టులో ముంపునకు గురైన సున్నపుతండా గ్రామ వాసుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రభుత్వం నుంచి గ్రామానికి కొత్త విద్యుత్ లైన్‌కు రూ.15 లక్షలు మంజూరు చేయించినట్లు ఎంపీటీసీ సభ్యుడు శంకర్ నాయక్ బుధవారం తెలిపారు. గ్రామం ముంపునకు గురి కావడం వల్ల విద్యుత్ లైన్ ప్రధాన కాల్వలో పోయిందన్నారు.

‘డబుల్’ ఇళ్ల పంపిణీపై విచారణ చేపట్టాలి

చిన్నచింతకుంట: మండలం కురుమూర్తి గ్రామంలో ప్రభుత్వం అందించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీపై అధికారులు విచారణ చేపట్టాలని బీజేపీ మండల నాయకుడు రాము డిమాండ్ చేశాడు. వెంటనే విచారణ చేపట్టి పేదలకు న్యాయం చేయాలని బుధవారం గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ సువర్ణ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుమూర్తి గ్రామంలో ప్రభుత్వం నిరుపేదలకు 140 డబుల్ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించిందన్నారు. కానీ అధికారులు, నాయకులు కుమ్మక్కై లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అర్హులకు కాకుండా గతంలో లబ్ధిపొందిన వారికే ఇళ్లను అందించారని మండిపడ్డారు. దీంతో నిరుపేదలకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు పొందిన వారు వేరేవారికి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.



నత్తనడకన రహదారి పనులు

నర్వ: కొన్ని రోజులుగా మక్తల్ – గద్వాల రహదారి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. రహదారి పనులు చేపట్టినప్పటికి ఇప్పటి వరకు పూర్తి కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. నిత్యం ఈ మార్గం గుండా మక్తల్, గద్వాలకు ప్రజలు, వ్యాపారస్తులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి పనులు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సత్యావార్ నుంచి మిట్టనందిమల్ల వరకు కంకర వేసి తారు వేయక పోవడంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. మరో పక్క మిట్టనందిమల్ల నుంచి ప్రియదర్శిని, జూరాల డ్యాం వరకు అడుగడుగున గోతులు పడ్డాయని వాహనదారులు ప్రయాణించేందుకు జంకుతున్నారు. ప్రజల సౌకర్యార్థం వెంటనే బీటీ రోడ్డును నిర్మించాలని కాంట్రాక్టర్లకు, అధికారులను కోరుతున్నారు.

అక్రమంగా చెరువు మట్టి తరలింపు



నర్వ: మండలంలోని పాథర్చేడ్ ఊర చెరువు నుంచి నల్ల మట్టిని కొందరు అక్రమంగా తరలిస్తున్నారు. కొన్ని రోజుల నుంచి మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువులో మట్టిని జేసీబీలతో తవ్వి వాహనాలలో నింపుతున్నారు. అక్కడి నుంచి గుట్టు చప్పుడు కాకుండా నాయకుల అండదండలతో బట్టీలకు తరలిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సారవంతమైన మట్టిని ఇటుక బట్టీలకు తరలించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఇరిగేషన్ అధికారులు పరిశీలన చేసినా ఫలితం లేదు. వెంటనే మట్టి తరలింపును నిలిపి వేయాలని రైతులు కోరుతున్నారు.